క్లుప్తంగా

మాచాని సోమప్పకు ఘన నివాళి



పద్మశ్రీ మాచాని సోమప్ప విగ్రహం వద్ద నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో గురువారం చేనేత పితామహుడు పద్మశ్రీ మాచాని సోమప్ప 45వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక సోమప్ప సర్కిల్‌లో ఆయన విగ్రహానికి టౌన్‌బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్, బ్యాంకు పాలకవర్గ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ పద్మశ్రీ మాచాని సోమప్ప చేనేత రంగానికి వన్నె తెవడమేగాకుండా ఉపాధి కోసం ఫ్యాక్టరీలు, విద్యాసంస్థలతో పాటు మరెన్నో సేవా కార్యక్రమాలు చేసిన వ్యక్తిగా చరిత్రలో నిలిచారని గుర్తు చేశారు. టౌన్‌బ్యాంకు సీఈఓ గంగాధర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: పద్మశ్రీ మాచాని సోమప్ప వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి గురువారం స్థానిక చేనేత సంఘ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. చేనేతల అభ్యున్నతికి మాచాని సోమప్ప చేపట్టిన సేవలను కొనియాడారు. రాయలసీమ పద్మశాలి సంఘ కార్యదర్శి ఎంఆర్ శ్రీనివాసులు, కుర్నిసంఘ రాష్ట్ర అధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు, తొగటవీర క్షత్రీయ సంఘ జాతీయ కార్యదర్శి చింత శ్రీనివాసులు, నాయకులు ఛాయఓంకారి, శాసం శివదాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లార్తి దర్గాల్లో ఫాతెహాలు



ఎల్లార్తి దర్గాలను దర్శించుకుంటున్న భక్తులు

హొళగుంద: మండల పరిధిలోని ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం భక్తులు దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. దర్గాలో మొక్కులు చెల్లించుకోవడానికి జిల్లా నుంచే గాకుండా కర్ణాటక, తెలంగాణ తదితర దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ప్రత్యేక ఫాతెహాల్లో పాల్గొని దేవుళ్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాలు, షిర్డి సాయి బాబా ఆలయాలను భక్తులు దర్శనం చేసుకున్నారు. తీర్థ ప్రసాద పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

గుడిసె దగ్ధం

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని మాధవరం గ్రామంలో బొగ్గుల నరసన్న ఇంట్లో అనుకోకుండా మంటలు వ్యాపించి రెండు గుడిసెల్లో మంటలు చెలరేగాయి. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా వీలు కాలేదు. సమాచారం అందుకున్న ఎమ్మిగనూరు అగ్నిమాపక అధికారులు రంగప్రవేశం చేసి మంటలు అదుపుచేశారు. అగ్నిప్రమాదంలో రూ.5 లక్షల మేర పత్తి దిగుబడులు, ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మాధవరం పోలీసులు తెలిపారు

వెండి మండపం పరిశీలన



నూతన వెండి మండపాన్ని పరిశీలిస్తున్న పీఠాధిపతి సుభుధేంద్రతీర్థులు

మంత్రాలయం రూరల్: రాఘవేంద్రస్వామి మఠంలో మూలరాముల పూజ జరిగే మందిరంను వెండితో తయారు చేయించారు. శ్రీరామనవమి సందర్భంగా వెండి పూజ మండపంలో పూజ చేసేందుకు మండపం తయారు చేయించినట్లు పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థులు తెలిపారు. గురువారం వైఎస్సార్‌సీపీ నేత వై.సీతారామిరెడ్డితో కలిసి పూజ మండపంను పరిశీలించారు. భక్తులు సమర్పించిన కానుకలు, శ్రీ మఠం తరఫున కొంత నగదు ఖర్చు చేసి మండపం తయారు చేయించినట్లు అధికారులు తెలిపారు.

మసీదు భూమిని స్వాధీనం చేసుకోవాలి

పెద్దకడబూరు: జామియా మసీదుకు చెందిన 72 ఎకరాల భూములను వక్ఫ్ బోర్డు అధికారులు స్వాధీనం చేసుకోవాలని ముస్లింలు రోడ్డెక్కారు. మండల కేంద్రంలో 80 ఏళ్ల క్రితం జామియా మసీదును నిర్మించారు. మసీదుకు సంబంధించి 72 ఎకరాల పొలం ఉంది. గ్రామంలో 300కు పైగా ముస్లిం కుటుంబాలు ఉన్నాయి. మసీదుకు సంబంధించిన పొలంను 10 ఇళ్లకు చెందిన ముల్లా వారు మాత్రమే అనుభవిస్తున్నారు. అయితే మసీదును అభివృద్ధి చేయకుండా భూమిని అనుభవిస్తున్నారని గురువారం ముస్లింలు మసీదు నుంచి ర్యాలీగా బస్టాండ్‌కు చేరు కుని ధర్నా చేపట్టారు. అక్కడ ముస్లింలు, ముల్లా వారి మధ్య స్వల్ప ఘర్షణ ఏర్పడింది. అక్కడి నుంచి స్థానికపోలీస్‌స్టేషన్ చేరుకున్న ముస్లింలు న్యాయం చేయాలంటూ బైఠాయించారు. మసీదులో ప్రార్థన చేస్తున్న ఇమాంకు రూ.5 వేలు జీతం ఇచ్చి సరిపెడుతున్నారని, ఈ జీతాలు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. వక్ఫ్ బోర్డు అధికారులు చొరవ తీసుకుని ముల్లా వారి నుంచి భూమిని స్వాధీనం చేసుకొని మసీదును అభివృద్ధి చేయాలని కోరారు. ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.






ఎమ్మిగనూరు మార్కండేయ ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎర్రకోట జగన్, వెల్దుర్తి రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవ దృశ్యం, పత్తికొండలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్తున్న వాల్మీకులు,గురజాలలో శేషవాహనంపై స్వామి వార్ల ఊరేగింపు దృశ్యం

కనులపండువగా సీతారాముల కల్యాణం

- ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- శేషవాహనంపై సీతారామలక్ష్మణుల దేవత మూర్తుల ఊరేగింపు



మద్దికెరలో సీతారామ కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం.



కులుమాలలో సీతారాముల కళ్యాణ వేడుకలకు హాజరైన మహిళలు,



ఎమ్మిగనూరులో విశేష పూజలందుకుంటున్న సీతారాములు

ఎమ్మిగనూరు: శ్రీరామనవమి సందర్భంగా పట్టణంలోని వివిధ ఆలయాలు గురువారం పండుగ శోభతో కళకళలాడాయి. శ్రీరామచంద్రుడు, సీతాదేవిల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని వీవర్స్ కాలనీలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో, ఎస్ఎంటీ కాలనీలోని ఆంజనేయస్వామి దేవాలయంలో, ఆదోని రోడ్డులోని పంచముఖి ఆంజనేయ స్వామి దేవాలయం, మునెప్ప నగర్‌లో గల శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం, 11వ వార్డులో గల పాత ఆంజనేయ స్వామి దేవాలయం, తదితర ఆలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాలను ఉదయం 11.30 గంటలకు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, అష్టోత్తరనామార్చన కార్యక్రమాలను నిర్వహించారు. పచ్చని టెంకాయ మట్టెలతో, మామిడి ఆకులతో, చెండుపూలతో, రంగురంగుల పేపర్లతో, బ్యానర్లతో ఆలయాలను ఆయన పెద్దలు ముస్తాబు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకీ సేవ, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

నందవరం: దక్షిణ కాశీగా పేరుగాంచిన పవిత్ర పుణ్య క్షేత్రం గురజాల రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా సీతారాముల కల్యాణం రమనీయంగా సాగింది. రాయచోటి శ్రీరాముడి ఆలయం, కొత్తకైరవాడి ఆంజనేయస్వామి, ధర్మపురంలోని అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, గోపుర కలశ ప్రతిష్ఠాపనతో పాటు సీతారాముల కల్యాణం కమనీయంగా జరిగింది. జొహరాపురంలో హనుమాన్ ఆలయంలో వేకువజామునే రాములోరి మూల విరాట్‌లకు విశేష పూజలు చేపట్టారు. గురజాల రామలింగేశ్వర స్వామి ఆలయంలో పురోహితుడు హంపేష్ స్వామి, ఆలయ చైర్మన్ పెద్ద నరసింహులు దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం దేవతమూర్తులను శేషవాహనంపై కొలువుంచి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. టి.సోమలగూడూరు, కనకవీడు, హాలహర్వి, గంగవరం, మాచాపురం, నాగలదిన్నె, కొత్తకైరవాడి తదితరల గ్రామాల్లో ఉచ్చాయం పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు సంప్రదాయ దుస్తుల్లో పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

పత్తికొండ రూరల్ : శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాంత్‌ఆచారి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూరగాయల మార్కెట్ ఆవరణంలో వాల్మీకి రామాలయంలో ఆలయ కమిటీ అద్యక్షుడు శివశంకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ రాములోరి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు చేశారు.

ఆలూరు: శ్రీరామనవమి పండుగను నియోజకవర్గం వ్యాప్తంగా అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో భక్తుల మధ్య సీతారాముల కల్యాణోత్సవం జరిపించారు. ఆలూరులోని రామాలయంలో రామమూర్తి, కమ్మరచేడు ఆంజనేయస్వామి దేవాలయంలో శాస్త్రి ఆధ్వర్యంలో గ్రామస్తులు రెండు వర్గాలుగా విడిపోయి సీతారాముల కల్యాణం జరిపించారు. భక్తులకు అన్నదానం చేశారు.

హొళగుంద: సుకువాయి గ్రామంలో ఆంజనేయ స్వామి ఉచ్చాయోత్సవం గురువారం రాత్రి వైభవంగా జరిగింది. ఉచ్చాయంలో రామ, సీత, లక్ష్మణుల ఉత్సవమూర్తులను కొలువుంచి ఆలయ పూజారులు మహామంగళారతి, తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు ఉచ్చాయాన్ని ఎదురు బసవన్న కట్ట వరకు లాగారు.



సుకువాయిలో ఉచ్చాయోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



టి.గోకులపాడులో కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు,



ఆలూరులో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న మహిళలు,



యాటకల్లులో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు,



తుగ్గలిలో కలశ పూజకు వెళుతున్న మహిళలు

వాల్మీకుల సమ్మేళనం జయప్రదం చేయండి

వెల్దుర్తి: వాల్మీకి/బోయలకు ఎస్టీ రిజర్వేషన్ల అంశంపై ఈనెల 24న రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయడంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపేందుకు ఏప్రిల్ 2న కర్నూలులో తలపెట్టిన మహా ప్రదర్శనకు స్వచ్ఛందంగా తరలిరావాలని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయాభివృద్ధి సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ పిలుపునిచ్చారు. గురువారం అయన స్థానిక నాయకులతో కలిసి పాతబస్టాండులోని వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. బోయ, వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శామ్యూల్‌చే విచారణ చేయించి, అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపడం జరిగిందన్నారు. బోయ, వాల్మీకులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపేందుకు మహా ప్రదర్శనను విజయవతం చేసేలా ప్రతి వాల్మీకి నాయకుడు పూనుకోవాలన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వాల్మీకి సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గోపినాథ్ నాయుడు, వైఎస్సార్సీపీ పట్టణ కన్వీనర్ వెంకట్‌నాయుడు, నాయకులు హరి సింహనాయుడు, శ్రీను, ప్రతాప్, చినబాబు, హరి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న గ్రంథాలయాభివృద్ధి సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్

ఆస్పరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతగా ఏప్రిల్ 2వ తేదీన చేపట్టే చలో కర్నూలు, మహా ప్రదర్శన కార్యక్రమానికి వాల్మీకులు తరలిరావాలని ఏంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి .రాం భీంనాయుడు పిలుపునిచ్చారు. గురువారం ఆస్పరిలో వాల్మీకుల సమావేశం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఈనెల 24వ తేదీన వాల్మీకి, బోయ కులాలను ఎస్టీలుగా గుర్తిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. వాల్మీకి నాయకులు కట్టెల గోవర్ధన, సుంకర రామాంజినేయులు, హాలిగేర రామాంజినేయులు, పెద్దయ్య పాల్గొన్నారు.

ఆలూరు: ఏప్రిల్ 2న కర్నూలులో నిర్వహించతలపెట్టిన మహా సమ్మేళనానికి వాల్మీకులు తరలిరావాలని చైర్మన్ సుభాష్ చంద్రబోస్, రాంభీమ్‌నాయుడు పిలుపునిచ్చారు. దేవనకొండలోని గెస్ట్‌హౌస్‌లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో వివిధ గ్రామాల వాల్మీకి పెద్దలతో సమావేశమై మహా సమ్మేళనం విజయవతంపై పలు సూచనలు చేశారు. మహా సమ్మేళనం కరపత్రాలను ఆవిష్కరించారు.

నేడు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

కృష్ణగిరి: శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని పెనుమాడ గ్రామంలో శుక్రవారం రాష్ట్రస్థాయి బాలుర కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి దాతల సహకారంతో వరుసగా రూ.20 వేలు, రూ. 15 వేలు, రూ. 10 వేలు, రూ.5 వేలను అందించడం జరుగుతుందని, ఆసక్తి గల వారు రూ.300 ఎంట్రీఫీజు చెల్లించి జట్లు పేరు నమాదు చేసుకోవాలని సూచించారు. అలాగే బెస్ట్ రైడర్, బెస్ట్ డిఫెండర్‌కు రూ.వెయ్యి చొప్పున ప్రోత్సాహకం ఉంటుందని, వివరాలకు 97012 59228, 90000 30774 నంబర్లను సంప్రదించాలన్నారు.

- అలాగే శుక్రవారం పాలపళ్ల ఎద్దులకు రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ. 20 వేలు,రూ.10 వేలు, రూ. 5 వేలు, రూ.3 వేలను దాతల సహకారంతో అందించనున్నట్లు తెలిపారు. వృషభాల యజమానులు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 97039 93872, 76759 19060 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు వెల్దుర్తికి ఎమ్మెల్యే రాక

వెల్దుర్తి: స్థానిక సొసైటీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పార్టీ సచివాలయ కన్వీనర్లతో నిర్వహించే సమావేశానికి పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హాజరవుతారని సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ సమీర్‌కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ త్వరలో నిర్వహించబోయే 'జగనన్నే మా భవిష్యత్తు' ప్రచార కార్యక్రమం కార్యాచరణలో భాగంగా సమావేశం నిర్వహించనున్నామన్నారు. మండలంలోని సచివాలయ కన్వీనర్లు సమావేశానికి హాజరుకవాలని కోరారు.

జిల్లా డాక్టర్ల విభాగం అధ్యక్షుడిగా కృష్ణమూర్తి

ఆదోని టౌన్: వైఎస్సార్సీపీ జిల్లా డాక్టర్ల విభా గం అధ్యక్షుడిగా ఆదోనికి చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఓ.ఎం.కృష్ణమూర్తి నియమితులయ్యారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో డాక్టర్లు, పార్టీ నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఓఎం.కృష్ణమూర్తి మాట్లాడు తూ జిల్లా డాక్టర్ల విభాగం అధ్యక్షుడిగా తనను ఎంపిక చేయడం, నిరుపేదలకు సేవలు చేసుకునే అవకాశం కల్పించిన ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఏప్రిల్ 3 నుంచి పింఛన్లు

మద్దికెర: సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఏప్రిల్ 3వ తేదీన చేపట్టనున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి గురువారం తెలిపారు. ఏప్రిల్ 1న ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున దేశవ్యాప్తంగా బ్యాంకులకు సెలవు, అలాగే 2వ తేదీ ఆదివారం సెలవు ఉంటుందన్నారు. కావున వైఎస్సార్ పింఛన్ కానుకను 3వ తేదీ నుంచి పంపిణీ చేస్తామని వెల్లడించారు.

16న గురుకుల ప్రవేశ పరీక్ష

ఎమ్మిగనూరురూరల్: మహాత్మ జ్యోతిరావుపూలే సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్, గోరంట్ల ప్రిన్సిపాల్ ఎస్.షనున్నిసా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలో ఆమె మాట్లాడుతూ ప్రవేశ పరీక్షకు జిల్లాలో కొత్తగా 6 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 4వ తేదీ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

నేడు గోనెగండ్లకు ఎమ్మెల్యే రాక

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లకు శుక్రవారం ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి వస్తున్నట్లు ఏపీఎం హేమలత తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ మండలంలో 565 పొదుపు గ్రూపులకు వైఎస్సార్ ఆసరా పథకం మూడవ విడత కింద రూ.3.48 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు గోనెగండ్లలోని బాషా ఫంక్షన్ హాలులో జరిగే వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి హాజరై లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తారని తెలిపారు.

తాగు నీటి సమస్య తీర్చండి

హొళగుంద: మండల పరిధిలోని హొన్నూరు క్యాంపులో ప్రజలు తాగు నీటి సమస్యతో అల్లాడుతున్నట్లు మంగళవారం ఆయా గ్రామస్తులు తెలిపారు. హొళగుందలోని అయోధ్యనగర్‌లో ఎన్నో ఏళ్ల నుంచి పబ్లిక్, సొంత కొళాయిలు లేకపోవడంతో దాదాపు 200 కుటుంబాలు తాగు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నాయి. అర కిలో మీటర్ దూరం వెళ్లి తాగు నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇక నాగరకణ్వీలో కొద్ది రోజులుగా మంచి నీటి సమస్య ఏర్పడినా ఎవరూ పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోయారు. వంకలు, వాగుల్లోని నీటిని తెచ్చుకుని తాగుతున్నట్లు చెప్పారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

స్నేహభావంతో క్రీడల్లో రాణించాలి

ఆలూరు: క్రీడలు స్నేహపూర్వకంగా ఆడుకోవాలే తప్పా, ఘర్షణలకు పాల్పడరాదని దేవనకొండ ఎస్‌ఐ భూపాలుడు సూచించారు. మండలంలోని గుండ్లకొండ గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా అంతర్రాష్ట్ర హోం కబడ్డీ పోటీలను గురువారం నిర్వహించారు. పోటీల్లో 32 జట్లు పాల్గొన్నాయి. విజేతగా గోనెగండ్ల జట్టు నిలవగా, తరువాతి స్థానాల్లో గుంతకల్లు, సనగండ్ల, నునసరాళ్ల జట్లు నిలిచాయి. ఆయా జట్లకు దాతలు, నిర్వాహకులు బాపూజీ రూ.30 వేలు, ఈరన్న రూ.20 వేలు, సంజీవ్‌కుమార్ రూ.10 వేలు, నాలుగో బహుమతిని గౌడు అందజేశారు. సర్పంచ్ ఫాతిమా క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. నాయకులు కబీర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి దిగుబడులు అపహరణ

కోసిగి: మండల పరిధిలోని సజ్జలగుడ్డం గ్రామంలో రైతులు మేకల చంద్ర, లక్ష్మికి చెందిన మిర్చి దిగుబడులను కళ్లంలో ఆరబోయగా గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకు పోయినట్లు బాధితులు గురువారం కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులు మాట్లాడుతూ.. తమకున్న నాలుగెకరాల పొలంలో బ్యాడిగి సీడ్ జంట (2043 హెచ్‌పీహెచ్) రకం మిరప పంటను సాగుచేసినట్లు తెలిపారు. పంట కాపునకు రావడంతో కోత కోసి దిగుబడులను పొలంలో ఆరబెట్టినట్లు చెప్పారు. బుధవారం అర్ధరాత్రి దొంగలు పొలంలో ఆరబెట్టిన దాదాపు 4 క్వింటాళ్ల మిర్చి దిగుబడులను దోచుకెళ్లినట్లు బాధితులు వాపోయారు. వాటి విలువ ప్రస్తుత మార్కెట్ ఆధారంగా రూ.3 లక్షలు ఉంటుందని తెలిపారు. గ్రామానికి చెందిన కొందరు ఆకతాయిలు దొంగతనం చేసి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేశారు. దొంగలను పట్టుకుని న్యాయం చేయాలని కోరారు.



పొలంలో మిగిలిన మిర్చి దిగుబడి

వల్లూరు వృషభాల జయకేతనం

కృష్ణగిరి: మండల పరిధిలోని టి.గోకులపాడు గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి వృషభాల బండలాగుడు పోటీలను గురువారం ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఎద్ల పందేలను ప్రోత్సహించడం అంటే రైతులను ప్రోత్సహించినట్లేనని కొనియాడారు. పోటీల్లో కర్నూలు జిల్లా, కోడుమూరు మండలం వల్కూరుకు చెందిన దొడ్డికాటి తిరుమలేష్ వృషభాలు ప్రథమస్థానంలో నిలిచాయి. రెండవ స్థానంలో నంద్యాల జిల్లా బేతంచర్లకు చెందిన మేకల వెంకటరాముడు వృషభాలు, మూడవ స్థానంలో గడివేముల మండలం పెసరవాయి సయ్యద్ కలాం బాషా వృషభాలు, నాల్గవ స్థానంలో ప్యాపిలి మండలం పీఆర్ పల్లె చిన్న నాగన్న వృషభాలు, ఐదవ స్థానంలో అనంతపురం జిల్లా, యాడికి మండలం, కందనకోట చెన్నప్ప వృషభాలు గెలుపొందినట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన వృషభాల యజమానులకు దాతలు, వైఎస్సార్‌సీపీ నాయకులు తెలుగు మల్లేష్, ప్రభాకర్‌రెడ్డి, పూల రాజు, నీలకంఠి తిమ్మరాజు, గ్రామ వలంటీర్లు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదు బహుమతులు అందించారు.



టి.గోకులపాడులో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి

ఎమ్మెల్యేలను కొనడం బాబుకు కొత్తేమీ కాదు

మంత్రాలయం రూరల్: ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కొనడం చంద్రబాబుకు కొత్తేమీ కాదని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. గురువారం ఉదయం శ్రీరామనవమి సందర్భంగా ఆయన సోదరుడు శ్రీనివాసులుతో కలిసి రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు మంత్రాలయం వచ్చారు. ముందుగా గ్రామదేవత మంచాలమ్మ, రాఘవేంద్ర స్వామి మూల బృందావనంకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వీరికి మఠం పీఠాధిపతి సుభుధేంద్రతీర్థులు శేషవస్త్రం కప్పి, ఫలమంత్రాక్షింతలిచ్చి ఆశీర్వదించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు టీడీపీకి టచ్‌లో ఉన్నారనేది ఎల్లో మీడియా ప్రచారమేనని, అందులో వాస్తవం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చానని చెప్పే ధైర్యం చంద్రబాబునాయుడు లేదని మండిపడ్డారు. 2024 ఎన్నికల్లో కుడా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. మఠం మేనేజర్ ఎస్‌కే.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ.నరసింహమూర్తి, సీఐ శ్రీనివాసులు, ఎస్‌లు వేణుగోపాల్‌రాజు, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



మంత్రాలయంలో పీఠాధిపతి చేతుల మీదుగా మెమొంటో తీసుకుంటున్న మంత్రి గుమ్మనూరు జయరాం

హత్య ఘటనపై కేసు నమోదు

కౌతాళం: మండల పరిధిలోని హాల్వి గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన ఉసేన్ బాషా హత్యకేసులో ముగ్గురు అనుమానితులపై కేసు నమోదు చేసినట్లు కోసిగి సీఐ ఏరిషావలి, కౌతాళం నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. మృతుని భార్య వన్నూర్‌బీ ఇచ్చిన ఫిర్యాదులో గ్రామానికి చెందిన చిన్న లక్ష్మినారాయణ కుమారులు ముగ్గురిపై అనుమానం వ్యక్తం చేసినట్లు చెప్పారు. స్థల వివాదం ఉండడంతో తన భర్తను వారే చంపిఉంటారని? లేదా ఇతర కారణం ఉండొచ్చని? ఫిర్యాదుతో పేర్కొనడంతో ఆయా కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. నేరస్తులను త్వరలోనే పట్టుకుని కేసు ఛేదిస్తామన్నారు. నిందితుల కోసం మూడు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

ఘటన స్థలాన్ని పరిశీలించిన డాగ్ స్క్వాడ్

హత్య కేసు ఛేదనలో భాగంగా గురువారం ఉదయం క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటన స్థలంలో దొరికిన వస్తువులను సేకరించారు. డాగ్ స్క్వాడ్ గ్రామంలోని ప్రధాన రోడ్ల గుండా సంచరించి నదిచాగి రోడ్డు వైపు కొద్ది దూరంలో వెళ్లి ఆగిపోయాయి దీంతో నిందితులు కర్ణాటకలో తలదాచుకున్నట్లు భావిస్తున్నారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం సిబ్బంది